## క్లుప్తంగా

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 9న విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. పెద్దమ్మగడ్డ ప్రభుత్వ ఐటీఐ, బీఎస్ఎన్ఎల్ భవన్ వెనుక వైపు, ఇండస్ట్రియల్ ప్రాంతం, ములుగు రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. జక్కలొద్ది, తిమ్మాపూర్, అల్లీపూర్, చింతల్, ఆదర్శనగర్, తూర్పు కోట, మధ్య కోట, పశ్చిమ కోట, గోవిందరాజుల గుట్ట, స్టేషన్ రోడ్డు, సీకేఎం ఆస్పత్రి, కృష్ణాకాలనీ, వరంగల్ చౌరస్తా, జేపీఎన్ రోడ్డు, పోలవారి వీధి, డాల్ఫిన్ హోటల్, అండర్ బ్రిడ్జి, బీట్ బజార్, విజయ టవర్, మేదరివాడ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**రేపు విశ్వకర్మ వసతి భవనం ప్రారంభం**

వరంగల్ చౌరస్తా: వరంగల్ స్వర్ణకార వీధిలోని విశ్వకర్మ వసతి భవనాన్ని ట్రస్టు బోర్డు కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ప్రారంభించనున్నట్లు గౌరవ అధ్యక్షుడు కట్టా సత్యనారాయణ, అధ్యక్షుడు రామోజు జయసాగర్, ప్రధాన కార్యదర్శి కత్రోజు యాదగిరి కోశాధికారి రవీందర్ తెలిపారు. ఈ మేరకు వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### జీఆర్పీ సీఐగా నరేష్‌కుమార్



కాజీపేట రూరల్: కాజీపేట జీఆర్పీ సీఐగా వడ్డె నరేష్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కాజీపేట జీఆర్పీ సీఐగా పనిచేస్తున్న ఎం.రాంమూర్తి మామునూరు పోలీస్ ట్రైనింగ్ కళాశాలకు బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో మామునూరు పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో చీఫ్ లా ఇన్‌స్ట్రక్టర్ (సీఐ)గా పనిచేస్తున్న నరేష్‌కుమార్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. కాగా, 2007 బ్యాచ్‌కు చెందిన నరేష్‌కుమార్ వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లలో సీఐగా బాధ్యతలు చేపట్టారు.

### కారుణ్య నియామకం



కేయూ క్యాంపస్: యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో స్టోర్‌కీపర్‌గా ఉద్యోగం చేస్తూ గతేడాది డిసెంబర్ 31న నర్మెట్ట అయిలయ్య మరణించారు. ఆయన భార్య గోవిందు స్వప్న కుమారికి కారుణ్య నియామకం కింద కామాటిగా నియమిస్తూ కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు స్వప్నకుమారికి వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం గురువారం నియామక ఉత్తర్వులు అందజేశారు.

### తీర్పు.. పాలకులకు చెంపపెట్టు



న్యూశాయంపేట: గత పాలకుల కక్ష సాధింపు చర్యలకు చెంపపెట్టుగా న్యాయస్థానం తీర్పు నిలిచిందని టీఎస్‌యూటీఎఫ్, జాక్టో నేతలు అన్నారు. 2020, డిసెంబర్ 29న యూఎస్‌పీసీ జాక్టో నేతలు చేసిన మహా ధర్నా సందర్భంగా గత ప్రభుత్వం పెట్టిన కేసులో ఉపాధ్యాయ సంఘాల నాయకులు చావ రవి, సదానందం, లింగారెడ్డిని సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టు నిర్దోషులుగా ప్రకటిస్తూ కేసు కొట్టివేసింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ, జాక్టో ఆధ్వర్యంలో వరంగల్ డీఈఓ కార్యాలయం ఎదురుగా నాయకులు గురువారం స్వీట్లు పంపిణీ చేశారు.

### 15న మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్

హన్మకొండ: ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈనెల 15న మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించనున్నట్లు గౌతమ్ జూనియర్ కళాశాల డైరెక్టర్ అంబిర శ్రీకాంత్ తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెరిట్ టెస్ట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు రూ.20 లక్షల విలువైన ఉచిత విద్యను హాస్టల్ సౌకర్యంతో అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు 93934 44808, 91006 66804, 79954 24666 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

### 'శ్వేతార్క'లో ఊంజల్ సేవ

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో వసంతోత్సవ ముగింపు వేడుకలను గురువారం నిర్వహించారు. ఉత్సవాలను ఆరు రోజుల పాటు శాస్త్రోక్తంగా నిర్వహించిన పండితులను ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ సన్మానించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలందించిన కార్యకర్తలను అభినందించారు. సిద్ధి, బుద్ధి సమేత గణనాథుడి ఉత్సవ విగ్రహాలకు ఊంజల్ సేవ నిర్వహించారు.

# ఇష్టారాజ్యంగా మిర్చి కల్లాలు



వ్యర్థాల దహనంతో ఎగిసి పడుతున్న మంటలు



ఆందోళన వ్యక్తం చేస్తున్న కాలనీల వాసులు



మంటలను ఆర్పుతున్న పోలీసు, ఫైర్ సిబ్బంది

- తగులబెట్టిన పొగతో ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

వరంగల్: వరంగల్ గ్రెయిన్ మార్కెట్ నుంచి ఎన్టీఆర్‌నగర్ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా మిర్చి కల్లాలు ఏర్పాటు చేసి మిర్చి నుంచి వేరు చేసిన తొడిమెలు, వ్యర్థాలను రాత్రి వేళల్లో తగలబెడుతున్నారు. ఈక్రమంలో వెలువడే పొగతో ఊపిరి ఆడక ఇబ్బందులు పడుతున్నామని సమీపంలోని ఆయా కాలనీల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నట్లు చెబుతున్నారు. బుధవారం రాత్రి భారీగా మంటలు ఎగసిపడడంతో 14వ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్‌కు ఎన్టీఆర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈర్ల రాజేందర్ సమాచారం అందించారు. ఏనుమాముల సీఐ రాఘవేందర్ దృష్టికి సమస్యను ఇంతియాజ్ తీసుకెళ్లారు. ఈ విషయమై ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో పోలీస్ సిబ్బంది, ఫైరింగ్ స్టేషన్ సిబ్బంది సంఘటన స్థలానికి వచ్చి మంటలో ఆర్పే ప్రయత్నం చేశారు. అయినా మంటలు చల్లారకపోవడంతో పోలీసు సిబ్బంది జేసీబీ, డోజర్లను తీసుకొచ్చి మూడు గంటలు పాటు శ్రమించి మంటలు ఆర్పినట్లు తెలిసింది. గతంలో ఇలాంటి పొగల వల్ల గ్రామాల్లో పలువురు అస్వస్థతకు గురై ఆస్పత్రుల పాలయ్యారని, చిన్నపిల్లలకు ప్రమాదంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కల్లాల నిర్వాహకులపై చర్యలు తీసుకోకుంటే మార్కెట్ ఎదుట నిరాహార దీక్ష చేస్తామని ఆయా కాలనీలవాసులు హెచ్చరిస్తున్నారు.

## ముగిసిన బాలగోకుల శిక్షణ శిబిరం



బాలగోకులంలో శిక్షణ పొందిన చిన్నారులు

హన్మకొండ చౌరస్తా: మాధవ స్మారక సమితి, వరంగల్ శాఖ ఆధ్వర్యంలో హనుమకొండ కాకాజీకాలనీలోని శ్రీవివేకానంద యోగా కేంద్రంలో గత 8 రోజులుగా నిర్వహిస్తున్న బాలగోకులం వేసవి ఉచిత శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు డాక్టర్ కోదాటి సుధాకర్‌రావు అధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశానికి పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ ఎస్.సతీష్, ఆత్మీయ అతిథిగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వరంగల్ విభాగ్ సంఘచాలక్ ప్రొఫెసర్ చిలుకమారి సంజీవ, ఆర్ఎస్ఎస్ వరంగల్ మహానగర్ సంఘ్‌చాలక్ డాక్టర్ బందెల మోహన్‌రావు, కేయూ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి హాజరై మాట్లాడారు. శిక్షణ శిబిరంలో భారతీయ సంప్రదాయాలు, నైతిక విలువలు, సంస్కృతి, దేశభక్తి, దైవభక్తి, ఆటలు, యోగాసనాలు, సూర్య నమస్కారాలు, చిత్రలేఖనం, తెలుగు పద్యాలు నేర్పించడం హర్షనీయమని ప్రశంసించారు. అనంతరం చిన్నారులకు ప్రశంసపత్రాలు అందజేశారు. మాధవ స్మారక సమితి ప్రధాన కార్యదర్శి రామానుజస్వామి, సభ్యులు ఊటుకూరి మనోహర్, శిక్షకులు సత్తు రామనాథం, కుమారస్వామి, దీపక్, మేరుగు అనురాధ, శ్రీనివాస్, సుధాకర్, నాగరాజు పాల్గొన్నారు.

## వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



శిబిరంలో మాట్లాడుతున్న ఫాదర్ థామస్ కోసి

మడికొండ: మడికొండ – అయోధ్యపురం రోడ్డులోని ఎంఎస్ఆర్ కాలనీలో డాన్‌బోస్కో జీవన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 15రోజుల పాటు కొనసాగనున్న వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. జేరిపోతుల జయరాజ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సంస్థ డైరెక్టర్ ఫాదర్ థామస్ కోసి మాట్లాడుతూ వేసవిలో పిల్లలు ఆడుతూ పాడుతూ చదువుకోవాలని పిలుపునిచ్చారు. బడీడు పిల్లలు బడిలో ఉండాలని, వేసవి శిబిరం ద్వారా చదువు ప్రాముఖ్యతను వారికి వివరించాలని నిర్వాహకులకు సూచించారు. చదువు ద్వారానే సమాజంలో గౌరవం దక్కుతుందని పిల్లలకు చెప్పారు. బాల కార్మికులు కనిపిస్తే 1098 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ పరికి సుధాకర్, మడికొండ మండల పరిషత్ పాఠశాల హెచ్‌ఎం మల్లారెడ్డి, అయోధ్యపురం పాఠశాల హెచ్‌ఎం మన్నె చంద్రయ్య, బత్తుల మోహన్, కస్తూరి రాజు, మెరుగు దేవేందర్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

## అధునాతన టెస్ట్ ల్యాబ్ ప్రారంభం



టెస్ట్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న టి.మధుసూదన్

హన్మకొండ: నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ కార్యాలయం ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన అధునాతన టెక్నాలజీ మీటరు టెస్ట్ ల్యాబ్‌ను ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జ్ ఆపరేషన్ డైరెక్టర్ టి.మధుసూదన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ల్యాబ్‌లో అన్ని రకాల సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్, సిటీ, హెచ్‌టీ మీటర్లు కచ్చితత్వంతో పరీక్ష చేయవచ్చని వివరించారు. ఏకకాలంలో 20 మీటర్లను పరీక్షించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హనుమకొండ సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.మధుసూదన్ రావు, కన్‌స్ట్రక్షన్, ఎమ్మార్టీ డీఈ కె.దర్శన్ కుమార్, డీఈ టెక్నికల్ ఐ.విజేందర్ రెడ్డి, ఏడీఈ ఎం.తిరుపతి రెడ్డి, ఏఈ, ఉద్యోగులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికుల హక్కులకు ఈనెల 20న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేల్పుల సారంగపాణి, జక్కు రాజుగౌడ్ అన్నారు. ఈ మేరకు తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా పంచాయతీరాజ్ శాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సోమేశ్వర్‌కు గురువారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సారంగపాణి, జక్కు రాజుగౌడ్ మాట్లాడుతూ కార్మికులకు నష్టం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, పోరాడి సాధించుకున్న పాత కార్మిక చట్టాలనే కొనసాగించాలని సూచించారు. గ్రామ పంచాయతీ కార్మికులను గుర్తిస్తూ కార్మిక చట్ట పరిధిలోకి తీసుకురావాలని, 1వ పీఆర్‌సీలో నిర్ణయించిన ప్రకారం బేసిక్ వేతనం రూ.19,500 చెల్లించాలని, జీఓ నంబర్ 51ను సవరించాలని, మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని, జీపీ కార్మికులలో కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి పర్మనెంట్ చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి బత్తిని సదానందం, నాయకులు కుక్కల మల్లయ్య, తోడెం రాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

**సమ్మెను విజయవంతం చేయాలి**

హన్మకొండ: దేశవ్యాప్తంగా ఈనెల 20న నిర్వహించనున్న కార్మిక, ప్రజా సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య పిలుపునిచ్చారు. ఈనెల 20న జరగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోని 56, 57, 58వ డివిజన్లలో వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 1991 నుంచి అమల్లోకి వచ్చిన నూతన ఆర్థిక, ఉదారవాద విధానాల అమలు వల్ల దేశంలోని కార్మిక వర్గం, ప్రజలపై దాడి జరుగుతోందని, కార్మికవర్గం రక్తం చిందించి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకు వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బరుపట్ల మహేష్ మాట్లాడుతూ కార్మికులపై 12 గంటల పనిభారాన్ని పెంచే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, పోరాటాలు, సమ్మె హక్కులను కాలరాసే చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

**మోటారు వాహనాల చట్టాన్ని సవరించాలి**

హన్మకొండ: మోటారు వాహనాల చట్టం 2019ని సవరించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఎం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు జి.ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల 20న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సమ్మె వాల్‌పోస్టర్లను హనుమకొండ కేఎల్ఎన్ రెడ్డి కాలనీలో రోడ్డు రవాణా ట్రాన్స్‌పోర్టు డ్రైవర్స్ యూనియన్ నాయకులతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు రవాణా రంగం వెన్నెముక వంటిదన్నారు. డ్రైవర్లు ఒత్తిడికి లోనవుతూ తమ సేవలు అందిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం వలన రోడ్డు రవాణా ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్‌కు ఇప్పటివరకు సామాజిక భద్రత చట్టం (సంక్షేమ బోర్డు) ఏర్పాటు చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో రోడ్డు రవాణా ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ కన్వీనర్ ధరావత్ భాను నాయక్, నాయకులు దేవేందర్ రెడ్డి, బొల్లారం సంపత్, ఇ.సుధాకర్, సీహెచ్.కుమార్, శ్రీను, జయరాం, రఘు, మధు, ఖాజా, రమేష్ పాల్గొన్నారు.

### రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

కాజీపేట రూరల్: కాజీపేట ఫాతిమానగర్ బైపాస్ లైన్ సమీపంలోని ట్రెయిన్ వాషింగ్ సైడింగ్ వద్ద రైల్వేలైన్‌లో గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతి చెందాడని కాజీపేట జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి గురువారం తెలిపారు. సుమారు 65 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి వివరాలకు 98487 79372, 99483 48070 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

### గుండెపోటుతో జర్నలిస్ట్ మృతి

కాజీపేట: కాజీపేట పట్టణంలో గురువారం ఉదయం సీనియర్ జర్నలిస్ట్ వెంపటి శంకరయ్య (59) గుండెపోటుతో మృతి చెందారు. దాదాపు రెండు దశాబ్దాలుగా జర్నలిస్టుగా పనిచేసిన శంకరయ్య మృతదేహానికి ఐజేయూ, టీయూడబ్ల్యూజే –143, వరంగల్ ప్రెస్ క్లబ్ సభ్యులు, స్థానిక మీడియా పాయింట్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాజీపేటలో శంకరయ్య అంత్యక్రియలు గురువారం నిర్వహించారు.

### వ్యక్తి అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పరిధి కరీమాబాద్‌లోని పోచమ్మ గుడి లేన్‌కు చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. గుర్రపు రాజు గత నెల 10న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా అతని ఆచూకీ లభించలేదు. దాంతో రాజు భార్య గుర్రపు సరిత గురువారం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం వివరించారు.

### బాలుడిపై లైంగిక దాడి.. పోక్సో కేసు నమోదు

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీనివాసకాలనీలో ఓ బాలుడిపై యువకుడు లైంగిక దాడికి పాల్పడిన సంఘటనలో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

### పిల్లలను గమనిస్తూ ఉండాలి

హసన్‌పర్తి: ప్రస్తుతం వేసవి కాలంలో పిల్లలను తల్లిదండ్రులు నిత్యం గమనిస్తూ ఉండాలని సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర్ సూచించారు. సీనియర్స్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెలవుల్లో పిల్లలు చెరువులు, కుంటలు, వ్యవసాయ బావులకు ఈత కోసం వెళ్లే అవకాశం ఉందని గుర్తుచేశారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. తల్లిదండ్రుల ప్రవర్తన, మాట్లాడే తీరు పిల్లలపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్ మాట్లాడుతూ వృద్ధుల పట్ల గౌరవంతో మెలగాలన్నారు. సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దామెర నర్సయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ పూల, కారోబార్ సదానందం తదితరులు పాల్గొన్నారు.

## ఫీజుల నియంత్రణను అమలు చేయాలి



గణేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఊట్కూరి ప్రణీత్ గౌడ్, బాష బోయిన సంతోష్ డిమాండ్ చేశారు. ఈమేరకు విద్యారంగ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని హనుమకొండ డీఆర్ఓ, ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ వైవీ.గణేష్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులను మాత్రమే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు తీసుకోవాలని సూచించారు. ఒకవేళ పెంచాల్సి వస్తే కలెక్టర్, డీఈఓ, పేరెంట్స్ కమిటీ నిర్ణయాధికారం మేరకు మాత్రమే ఫీజులు పెంచడాన్ని జీఓ నంబర్ 42 సూచిస్తుందని తెలిపారు. అలాగే, డీజీ, ఒలింపియాడ్, ఇ – టెక్నో అంటూ మభ్యపెట్టే తోక పేర్లను తొలగించాలని, ప్రభుత్వ అనుమతి లేని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను సీజ్‌చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కోసం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కుక్కల కుమార్, వేల్పుల చరణ్, జిల్లా సమితి సభ్యులు శ్రీపతి వినయ్, జ్యోతి పాల్గొన్నారు.

## కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికులదే



మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

- మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

హసన్‌పర్తి: పరిశ్రమను కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికులదేనని మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. మేడే మాసోత్సవాలను పురస్కరించుకుని ఎల్లాపురంలోని ఎల్‌పీసీ కంపెనీలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పరిశ్రమ మూత పడినట్లయితే ఆ కంపెనీలో పనిచేసే కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతాయని చెప్పారు. సమస్యలు ఎదురైనప్పుడు కార్మికులు ఐక్యంగా ఉండి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల కోసం వారధిగా పనిచేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎల్‌పీసీ కంపెనీ యాజమాన్యం పెడుతున్న ఇబ్బందులను చీఫ్‌విప్ దృష్టికి కార్మికులు తీసుకెళ్లారు. అకారణంగా 30మంది కార్మికులను తొలగించారని చెప్పారు. సమావేశంలో కంపెనీ జీఎం గణేష్, ఇన్‌చార్జ్ సిన్హా, యూనియన్ అధ్యక్షుడు తిరుపతి, ఉపాధ్యక్షుడు భిక్షపతి, మాజీ సర్పంచ్ దేవరకొండ కుమారస్వామి, కొండపాక రఘు, రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, గిన్నారపు రవీందర్, సంఘం నాయకులు రమణాచారి, సురేందర్, రమేష్ పాల్గొన్నారు.

## భారత సైనికులకు సంఘీభావం



వరంగల్: సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తున్న చాంబర్ వ్యాపారులు, కార్మికులు, రైతులు

వరంగల్: జమ్మూకశ్మీర్‌లోని ప్రహల్గాం, బైసరన్ పర్యాటక ప్రాంతాల్లో ఉగ్రదాడులకు ప్రతీకారంగా భారత సైన్యం మంగళవారం రాత్రి అత్యాధునిక మిసైల్స్‌తో పాకిస్తాన్‌లోని ఉగ్ర శిబిరాలపై దాడులు చేసి సుమారు వంద మంది ఉగ్రవాదులను హతమార్చి, వందలాది మందిని గాయపరిచిన భారత త్రివిధ సైనిక దళాల పరాక్రమం అసామాన్యమైనదని వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి కొనియాడారు. ఈమేరకు చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఉదయం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో 'భారత సైనికులకు సంఘీభావ ర్యాలీ'ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం ఎంతో శాంతికాముక దేశమైనా శత్రుదేశాలకు తగు రీతిలో బుద్ధి చెప్పగలదని సిందూర్ ఆపరేషన్‌తో ప్రపంచానికి తెలిసిందన్నారు. పాక్ వెన్నులో వణుకు పుట్టించిన తమ సైనిక దళాల్లోని మహిళామణుల ధైర్యసాహసాలు తమకెంతో ఎంతో గర్వకారణమని ప్రశంసించారు. ర్యాలీలో చాంబర్ ప్రధాన కార్యదర్శి మడూరి వేదప్రకాష్, చాంబర్ మాజీ అధ్యక్షులు కటకం పెంటయ్య, దిడ్డి కుమారస్వామి, కోశాధికారి అల్లె సంపత్, సంయుక్త కార్యదర్శి సాగర్ల శ్రీనివాస్, అన్ని సెక్షన్ల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, వ్యాపారస్తులు, గుమస్తా, దడవాయి, హమాలీ, కార్మికులు, రైతులు పాల్గొని తమ మద్దతును తెలిపారు.

**పబ్లిక్ గార్డెన్ నుంచి ర్యాలీ**



హన్మకొండ చౌరస్తా: ర్యాలీ నిర్వహిస్తున్న పబ్లిక్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

హన్మకొండ చౌరస్తా: ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై హర్షం వ్యక్తం చేస్తూ భారత సైనికులకు సంఘీభావంగా గురువారం ఉదయం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గార్డెన్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. మతోన్మాదం నశించాలి.. ఉగ్రవాదం నశించాలి అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ తీశారు. ర్యాలీలో సాయిని రవికుమార్, గోపాల్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రవీందర్, పైడి, సారయ్య, శ్రీకాంత్‌రెడ్డి, రమణారెడ్డి, రోహిణి, రమ్య, మదన్మోహన్, కిశోర్ పాల్గొన్నారు.

**కిట్స్ క్రాస్ వద్ద..**

హసన్‌పర్తి: పహల్గాం దాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. పాక్ ఉగ్రవాద స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ పేరిట భారత సైనికులు వైమానిక దాడులు నిర్వహించి విజయం సాధించడాన్ని హర్షిస్తూ కిట్స్ క్రాస్ వద్ద ఎర్రగట్టు గుట్ట యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సైనికులకు మద్దతుగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నంది శ్రీనివాస్, పావుశెట్టి శ్రీధర్, గొరిశెట్టి కృష్ణమూర్తి, మూల దేవేందర్, బొక్క కుమార్, బోడ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

**49వ డివిజన్‌లో..**

హన్మకొండ అర్బన్: పీఓకే, పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భారత వాయుసేన చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై హర్షం వ్యక్తం చేస్తూ 49వ డివిజన్‌లోని లోటస్ కాలనీ కమిటీ సభ్యులు, కాలనీవాసులు జాతీయ జెండాతో గురువారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ కమిటీ ప్రతినిధులు మహేశ్వరం, గౌరీశంకర్, నేరెళ్ల శ్రీనివాస్‌రెడ్డి, సంకెనపల్లి దివాకర్‌రెడ్డి, బోనగారి రాములు, శరత్, నాగవెల్లి వెంకట్, దశరథరాంరెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.



హసన్‌పర్తి: సైనికులకు మద్దతుగా ప్రదర్శన



హన్మకొండ అర్బన్: జాతీయ జెండాలతో ర్యాలీ

## సంక్షిప్తంగా

**9 గంటల్లోపు వాకింగ్ చేయాలి**

వరంగల్: ఓసిటీ స్టేడియంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎవరికి అనుమతి లేదని వరంగల్ డీవైఎస్ఓ సత్యవాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాకింగ్, క్రీడలను ఉదయం 9 గంటల్లోపు పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. అలాగే, రాత్రి 8 గంటల తర్వాత వచ్చే ఆకతాయిలపై పోలీసుశాఖ సహకారంతో చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిర్ణీత సమయంలోపే మైదానాన్ని వ్యాయామం కోసం ఉపయోగించాలని సత్యవాణి చెప్పారు.

**డీఆర్డీఓకు అవార్డు ప్రదానం**

వరంగల్: స్వయం సహాయ సంఘాలకు 2024–25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు రుణాలు ఇప్పించడంలో ప్రతిభ కనబర్చినందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క, సెర్ప్ సీఈఓ దివ్యదేవరాజన్ చేతుల మీదుగా డీఆర్డీఓ కౌసల్యాదేవి అందుకున్నారు. అవార్డు వచ్చేందుకు కృషిచేసిన ఏపీఎంలు, సీసీలు, వీవీఏలకు, ఇతర సిబ్బందికి అభినందనలు ఆమె తెలిపారు.

**37మంది విద్యార్థులకు ఉద్యోగాలు**

హసన్‌పర్తి: ఎస్‌వీఎస్ కళాశాలలో ఫార్మసీ చదువుతున్న 37 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు తెలిపారు. కళాశాలలో అపోలో ఫార్మ కంపెనీ గురువారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించింది. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు నియామక పత్రాలు అందజేశారు. అపోలో ఫార్మ హెచ్‌ఆర్ మేనేజర్ రఘుపతి, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

**బాబాయ్ కుంటను కాపాడాలి**

హన్మకొండ అర్బన్: జిల్లాలోని ఐనవోలు మండల పున్నేలు గ్రామంలోని బాబాయ్ కుంట (తురకకుంట)ను రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబ్జా నుంచి కాపాడాలని విముక్త చిరుతల కచ్చి (వీసీకే) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చెరిపెల్లి ఆనంద్ డిమాండ్ చేశారు. ఈమేరకు నాయకులతో కలిసి హనుమకొండ డీఆర్ఓ, ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ వైవీ.గణేష్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. హనుమకొండ జిల్లా వైదిక పార్టీ అధ్యక్షుడు కన్నాల రవి, జిల్లా నాయకుడు సుమన్ బాబు పాల్గొన్నారు.

**మాదిగ జర్నలిస్టులు ఐక్యత చాటాలి**

హసన్‌పర్తి: మాదిగ జర్నలిస్టులు తమ ఐక్యతను చాటాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు ఆరెపల్లి పవన్ పిలుపునిచ్చారు. హసన్‌పర్తి మండల మాదిగ జర్నలిస్టుల ఫోరం సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగలను చైతన్యపర్చాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందని గుర్తుచేశారు. మండల మాదిగ జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ హక్కుల సాధన కోసం మాదిగ జర్నలిస్టులు నిరంతరం పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో ఫోరం ప్రధాన కార్యదర్శి మధుకర్, గౌరవ అధ్యక్షులు బాబు, రాజారపు భిక్షపతి, సహాయ కార్యదర్శి కోడెపాక శ్రీకాంత్, నాయకులు కుమార్, గరిగె శ్రీనివాస్, బొక్క రాజు, జన్ను అభిషేక్, రాజ్‌కుమార్, రేణుకుంట్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

**11న పౌరహక్కుల సంఘం మహాసభ**

నయీంనగర్: ఈనెల 11న హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించనున్న పౌరహక్కుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు పిలుపునిచ్చారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ కగార్‌ను కేంద్రం నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు కొనసాగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పి.రమేష్ చందర్, బి.సారంగపాణి, వెంగల్ రెడ్డి, శాంత, కోడెం కుమారస్వామి, ఓంబ్రహ్మం, అవినాష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.